సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 10 । జనవరి । 2025

ముక్కోటికి ముస్తాబు



మల్లాపూర్ : మండలంలోని వాల్గొండలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న త్రికూటాలయం శ్రీరామలింగేశ్వర ఆలయం ముక్కోటి వేడుకలకు ముస్తాబైంది. ఉత్తర ముఖద్వారం కలిగిన అతిపురాతన ఆలయంగా జిల్లాలోనే ప్రసిద్ధి చెందింది. వేకువ జామున ఆలయంలోని శివలింగంపై సూర్యకిరణాలు నేరుగా ప్రసరించండి ఈ ఆలయ ప్రత్యేకత. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సాంబారి శంకర్, వైస్ చైర్మన్ చిలివేరి లక్ష్మి తెలిపారు.



న్యూస్‌రీల్

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు కుమ్మరిపల్లి హెచ్‌ఎం



అభయ్‌రాజ్

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్‌రాజ్ దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఈనెల 7న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని తక్కువ ఖర్చు.. ఖర్చులేని బోధనోపకరణాలు రూపొందించిన సూపర్‌సైన్స్ కిట్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా ప్రయోగాలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకుగాను ఈనెల 21న పుదుచ్చేరిలో జరిగే దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. హెచ్‌ఎంను డీఈవో రాము, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, ఎంఈవో రాఘవులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులు



వర్షిత



మణిదీప్

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని మౌంట్‌కార్మెల్ స్కూల్ విద్యార్థి మణిదీప్ ట్రాన్స్‌పోర్ట్ కమ్యునికేషన్ విభాగంలో రూపొందించిన బార్డర్ అలారం ప్రాజెక్ట్, మెట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థిని వర్షిత సహజ వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా మల్టీపర్పస్ క్రాప్ ప్రొటెక్టర్ ప్రాజెక్ట్ ప్రదర్శించి దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు.

ఘనంగా భరణి నక్షత్ర వేడుకలు



ఆయుష్య హోమంలో భక్తులు

ధర్మపురి: భరణి నక్షత్రం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని శ్రీయమధర్మరాజుకు గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు బొజ్జ రమేశ్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం నిర్వహించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఎండిన పసుపునే తేవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

మల్లాపూర్: మార్కెట్ యార్డుకు ఎండిన పసుపు తెచ్చి గిట్టుబాటు ధర పొందాలని నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కార్యదర్శి అపర్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు గుండంపల్లిలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పసుపులో నాణ్యత పెంపుదలపై రైతులకు అవగాహన కల్పించారు. పసుపు రైతులు దిగుబడికి సరైన గిట్టుబాటు ధర రాక నష్టపోతున్నారని తెలిపారు. పసుపును ఉడకబెట్టి పూర్తిగా ఆరబెట్టిన తర్వాతే మార్కెట్‌కు తెచ్చి మెరుగైన మద్దతు ధర పొందాలన్నారు. పచ్చి పసుపు అమ్ముకుని నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్లు వెంకట్, ముజాహిద్, రైతులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో

మల్లాపూర్ : ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చేలా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీఐఈవో నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరుశాతాన్ని పరిశీలించారు. ఇంటర్‌లోనే విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు ఏర్పర్చుకోవాలని, గమ్యం చేరేవరకూ పట్టుదలతో చదవాలని సూచించారు. కమ్యూనికేషన్, రైటింగ్ స్కిల్స్‌లో పట్టు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ బండి సత్యనారాయణ, అధ్యాపకులు నంచర్ల రాజేశ్, మహేశ్, సంతోష్, శ్రీనివాస్, నరేశ్, రాజేందర్, రజిత, రాజ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాని పూత.. రైతన్న వెత

- మూడేళ్లుగా సరైన దిగుబడి ఇవ్వని మామిడి తోటలు
- నవంబర్ నుంచే రావాల్సిన పూత
- ఈసారి కూడా అంతంతమాత్రమే..
- వాతావరణ పరిస్థితులే కారణం
- కొన్నిచోట్ల వచ్చినా ఆశిస్తున్న తేనె మంచు పురుగు
- ఆందోళనలో అన్నదాతలు
- ఉమ్మడి జిల్లాలో దాదాపు 80 వేల ఎకరాల్లో సాగు



జగిత్యాల జిల్లాలోనే 35 వేల ఎకరాల్లో..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 80 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఒక్క జగిత్యాల జిల్లాలోనే 35 వేల ఎకరాల్లో విస్తరించాయి. సగటున ఎకరాకు 5 టన్నుల చొప్పున 4 లక్షల మె.ట. మామిడి దిగుబడి వస్తుందని అంచనా. అయితే, మామిడి సీజన్‌లో ధర సైతం టన్నుకు తక్కువలో తక్కువ రూ.30 వేల నుంచి రూ.40 వేలు పలుకుతుంది. సాధారణ పంటలైన వరి, మొక్కజొన్నకు పెట్టుబడులు పెరిగిపోవడం, కూలీలు దొరక్కపోవడంతో భూమి ఉన్న రైతులు మామిడి తోటలు పెంచుతున్నారు. జగిత్యాల, కరీంనగర్‌లలో మార్కెట్లు ఉండటం, ప్రధాన రోడ్ల వెంట మామిడిని ఎక్కడికక్కడే కొనుగోలు చేస్తుండటం కూడా ఇందుకు కారణం. వ్యాపారులు నేరుగా ఢిల్లీ, నాగ్‌పూర్ వంటి నగరాలకు తరలిస్తుండటంతో మామిడికి మంచి రేటు వస్తుందని ఆశపడ్డారు.

జగిత్యాల అగ్రికల్చర్: ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు మామిడి పంటకు ప్రతిబంధకంగా మారాయి. దీంతో, నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో రావాల్సిన మామిడి పూత ఇప్పటికీ చెట్లపై కనిపించడం లేదు. అక్కడక్కడ వచ్చిన పూతను తేనె మంచు పురుగు ఆశించి, తీవ్ర నష్టం చేస్తోంది. రెండు, మూడేళ్లుగా మామిడి పంట దిగుబడి సరిగా రావడం లేదు. ఈ ఏడాదైనా పంట వస్తుందో, రాదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొడి వాతావరణం ఉండాలి..

మామిడి పూత సాధారణంగా నవంబర్ నెల చివరి నుంచి ప్రారంభమై డిసెంబర్, జనవరి వరకు వస్తుంటుంది. పూత ఆలస్యమైనకొద్దీ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి, పూత, పిందెలు రాలిపోతుంటాయి. దీనికితోడు, ఏప్రిల్, మే నెలల్లో వచ్చే వడగాలులకు కాయలు రాలిపోతుంటాయి. అయితే, గత కొన్ని నెలలుగా వాతావరణంలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. అత్యల్ప ఉష్ణోగ్రతలతోపాటు తేమశాతం పెరగడం, చలి ప్రభావంతో పూ మొగ్గలు బిగుసుకుపోయి, సరిగా విచ్చుకోవడం లేదు. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో రాత్రివేళల్లో కురిసే మంచు కూడా పూతపై ప్రభావం చూపుతోంది. పూత నుంచి పిందె వచ్చే వరకు పొడి వాతావరణం ఉండాలి. కానీ, ఆ పరిస్థితులు కనిపించడం లేదు.

ఆశిస్తున్న తేనె మంచు పురుగు..

మూడేళ్లుగా మామిడికి పూత రాకపోవడం, వచ్చినా నిలవకపోవడం, విపరీతంగా తేనెమంచు పురుగు ఆశిస్తుండటంతో మామిడి రైతుకు అనుకున్న దిగుబడి రావడం లేదు. దీంతో, కొంతమంది ఇప్పటికే తోటలను తొలిగించగా, మరికొందరు ఈ ఏడాది పంట దిగుబడిని బట్టి నిర్ణయం తీసుకోవాలని చూస్తున్నారు. పూతకు ముందుగానే తెగుళ్లు, పురుగులు ఆశించకుండా మామిడి తోటల్లో ఒక్కో రైతు కనీసం ఎకరాకు రూ.20 వేల విలువైన రసాయన మందులు పిచికారీ చేయిస్తున్నారు. అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నా పూత రావడం, వచ్చినా నిలవడం కష్టమవుతోంది.

అధిక వర్షాలు పెద్ద దెబ్బ..

మామిడి చెట్లు పూతకు రావాలంటే బెట్ట పరిస్థితులు ఉండాలి. కానీ, గతేడాది సెప్టెంబర్ వరకు అధిక వర్షాలు కురిశాయి. భూమంతా తేమతో ఉంది. ఏటా కాయలు తెంపగానే, వర్షాకాలంలో చెట్లను ప్రూనింగ్(కొమ్మల కటింగ్) చేయిస్తే కొత్తగా వచ్చే కొమ్మలకు, రెమ్మలకు పూత వస్తుంది. పూత రాకపోవడానికి ఇది కూడా ఒక కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జనవరి నెల సగానికి వచ్చినా పూత రాకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే, మామిడి పూతల సీజన్ రాగానే.. తోటల వెంట పరుగెత్తే లీజుదారులు ఈసారి వాటి వైపే చూడటం లేదు.

ఎకరాకు రూ.20 వేల ఖర్చు



మా మామిడి తోటలో ఇప్పటికే ఎకరాకు రూ.20 వేలు ఖర్చు పెట్టి, అన్ని యాజమాన్య పద్ధతులు పాటించాను. పురుగు మందులు పిచికారీ చేయించాను. గత మూడేళ్లలో పూత లేదు. ఈసారి ఏం చేస్తుందో చూడాలి.

– కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి, వెంకట్రావుపేట, మేడిపల్లి మండలం

పూత అనుకున్నంత లేదు



మామిడి పూత ఈ ఏడాది కూడా అనుకున్నంత రాలేదు. అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటించాను. వచ్చిన కొద్దిపాటి పూతను తేనె మంచు పురుగు ఆశిస్తోంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– నక్కల రవీందర్ రెడ్డి, అంతర్గాం, జగిత్యాల రూరల్ మండలం

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



తేమ వాతావరణం ఉండటం, రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడం మామిడి పూతపై ప్రభావం చూపుతున్నాయి. అక్కడక్కడ వచ్చిన పూతను తేనె మంచు పురుగు ఆశించినందున రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

– పి.అరుణ్‌కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, వ్యవసాయ కళాశాల, జగిత్యాల

హెచ్‌ఎంపీవీపై భయం వద్దు

- ముందు జాగ్రత్తలే మేలు
- వ్యాపించకుండా అన్ని జాగ్రత్తలు
- ఆస్పత్రుల్లో సపరేట్ బెడ్లు ఏర్పాటు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్





ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

జగిత్యాల: చైనాలో విజృంభిస్తున్న హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ)పై ఆందోళన చెందవద్దని, జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. ప్రజలు భయాందోళనకు గురికావద్దన్నారు. చలికాలంలో సాధారణంగానే జలుబు, దగ్గు లక్షణాలుంటాయని, నిర్ధారణ కోసం వచ్చేవారికి శాంపిల్స్ తీసుకుంటున్నామని తెలిపారు. వైరస్ వ్యాప్తిపై తీసుకోవాల్సిన చర్యలను 'సాక్షి' ఇంటర్వ్యూలో వివరించారు.

సాక్షి: హెచ్‌ఎంపీవీపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారా..?

డీఎంహెచ్‌వో: వైరస్ గురించి పెద్దగా భయపడాల్సిందేమీ లేదు. సాధారణ వైరల్ ఫీవర్ ఫ్లూ తరహా లక్షణాలే ఉంటాయి. జలుబు, దగ్గు ఉంటాయి. కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలు తీసుకోవాలి.

సాక్షి: కేసులు పెరిగితే..?

డీఎంహెచ్‌వో: జిల్లాకేంద్రంలోని మాతా శిశు సంక్షేమ కేంద్రం, జనరల్ ఆస్పత్రి, కోరుట్ల ఏరియా ఆస్పత్రి, మెట్‌పల్లిలోని ఆస్పత్రుల్లో సపరేట్ బెడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. వైద్యులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

సాక్షి: వైరస్ ఎక్కువగా ఎవరికి సోకుతుంది..? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డీఎంహెచ్‌వో: 1 నుంచి ఐదేళ్లలోపు పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే 65ఏళ్ల పైబడిన వారికి వ్యాపించే అవకాశం ఉంది. శ్వాసకోశ ఇబ్బందులు, క్యాన్సర్ పేషెంట్స్, ఆస్తమా ఉన్న వారు జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది.

సాక్షి: నిర్ధారణ పరీక్షలు చేసుకోవచ్చా..?

డీఎంహెచ్‌వో: లక్షణాలున్నవారు ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌కు పంపిస్తాం. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులూ లేవు.

సాక్షి: వైరస్ సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

డీఎంహెచ్‌వో: ఇది కరోనా లాంటిదే. వ్యక్తుల మధ్య దూరం పాటించాలి. ఒకరికొకరు చేతులు కలపకూడదు. ప్రతిసారి శానిటైజర్ వాడాలి. పబ్లిక్ ప్లేస్‌లలో ఎక్కువగా విస్తరించే అవకాశం ఉంటుంది.

సాక్షి : వైరస్ ప్రధాన లక్షణాలేంటి?

డీఎంహెచ్‌వో: ముక్కు కారడం, దగ్గు, కరోనాకు సంబంధించిన లక్షణాలే ఉంటాయి. శ్వాసకోశ ఇబ్బందులు ఎక్కువగా కలిగిస్తుంది. ఈ వైరస్ సోకిన వారికి వాసన, రుచి లేకపోవడం లాంటివి ఉంటాయి.

సాక్షి: జలుబు, దగ్గు ఉంటే పరీక్ష చేయించుకోవాల్సిందేనా?

డీఎంహెచ్‌వో: శీతాకాలం కావడంతో జలుబు, దగ్గు సాధారణం. చాలారోజుల పాటు తగ్గకుంటే పరీక్షలు చేయించుకోవాలి. వైరస్ ముదిరితే ఇబ్బందులు ఎదురవుతాయి.

సాక్షి: గతంలో ఆక్సిజన్ సిలిండర్లు అందలేదు..? ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారా?

డీఎంహెచ్‌వో: జిల్లా ఆస్పత్రితోపాటు, కోరుట్ల, మెట్‌పల్లి ఆస్పత్రుల్లో ఐసోలేషన్ కేంద్రాల ఏర్పాటు, ఆక్సిజన్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని ఆస్పత్రులకు సమాచారం కోసం పోర్టల్ ఏర్పాటు చేశాం. వైద్యులు సమాచారం ఇస్తుంటారు. తక్షణ చర్యలు తీసుకుంటాం.

సాక్షి: ప్రజలకు ఎలాంటి సూచనలు ఇస్తారు?

డీఎంహెచ్‌వో: హెచ్‌ఎంపీవీ వైరస్‌తో భయం లేదు. ప్రజలు ఆందోళన చెందకూడదు. ఆస్పత్రుల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జాగ్రత్తగా ఉండటమే మేలు. జలుబు, ఫ్లూతో బాధపడుతున్న వ్యక్తుల నుంచి దూరంగా ఉండటం. మంచినీరు ఎక్కువగా తీసుకోవడం, పౌష్టికాహారం తినడం చేయాలి. అనారోగ్యంగా అనిపిస్తే ఇంట్లోనే ఉండాలి. తగినంత నిద్రపోవాలి. వైద్యులను సంప్రదించకుండా మందులు తీసుకోకూడదు.

వైరస్‌పై జాగ్రత్తలు పాటిద్దాం



ఐఎంఏ వారు ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తిపై ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటూ భయాన్ని వీడాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఐఎంఏ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తుమ్మినా, దగ్గినా చేతి రుమాలును అడ్డు ఉంచుకోవాలని సూచించారు. ఐఎంఏ అధ్యక్షుడు హేమంత్ మాట్లాడుతూ ఈ వైరస్ 2001 నుంచి ఉందని, ఇది శ్వాసకోశ సంబంధ వ్యాధులతో బాధపడే వారికి త్వరగా సోకే అవకాశం ఉందని, భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కోటగిరి సుదీర్‌కుమార్, గైనకాలజిస్ట్ ఒడ్నాల రజిత పాల్గొన్నారు.

నీటి విడుదల చేయండి

జగిత్యాల నియోజకవర్గానికి కాలువల ద్వారా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. డీ–53 కింద జిల్లాలో ఎక్కువ ఆయకట్టు ఉందని, జోన్–1 ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపివేయడం ద్వారా రైతులు ఇబ్బంది పడతారని తెలిపారు. అనంతరం జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహకు వినతిపత్రం అందించారు.

ఎమ్మెల్యేను కలిసిన పంచాయతీరాజ్ శాఖ ఈఈ

జగిత్యాలరూరల్: జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఈఈ లక్ష్మణ్‌రావు ఎమ్మెల్యే సంజయ్‌ను గురువారం కలిశారు. ఆయన వెంట డీఈ మిలింద్, గోపాల్, అశ్విన్ ఉన్నారు.

ఆడదూడలు జన్మించేలా కృత్రిమ గర్భధారణ

పెగడపల్లి: రాష్ట్రంలో పాల కొరత తీర్చేందుకు ఆడ దూడల సంతతి పెంపునకు కృత్రిమ గర్భధారణ చేస్తున్నామని జిల్లా పశువైద్యాధికారి మనోహర్, అసిస్టెంట్ డైరెక్టర్ నరేశ్, కరీంనగర్ పశుగణాభివృద్ధి అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్పీ.రెడ్డి తెలిపారు. మండలంలోని బతికపల్లిలో గురువారం పశుగణాభివృద్ధి సంస్థ, పశువైద్య, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో ఉచిత మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. 184 పశువులకు చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. ఆడదూడలు పుట్టేలా సెమన్ రూ.250కు అందుబాటులో ఉందన్నారు. పశుపోషణ, పశుగ్రాస పెంపకం, అధిక పాల దిగుబడి రావడానికి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మండల వెటర్నరీ అధికారి హేమలత, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, వివిధ మండలాల వెటర్నరీ అధికారులు కిరణ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వేణుగోపాల్, రాకేశ్, వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ఈ ఏడాది మొక్కల లక్ష్యం 37లక్షలు

- నాటిన ప్రతి మొక్కనూ బతికించాలి
- డీఆర్డీవో రఘువరన్



మొక్కలు పరిశీలిస్తున్న డీఆర్డీవో రఘువరన్

పెగడపల్లి: ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 37 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించినట్లు డీఆర్డీవో రఘువరన్ తెలిపారు. పెగడపల్లి మండలం రాములపల్లిలో నర్సరీని సందర్శించారు. మొక్కల పెంపకం, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించొద్దని సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని 380 పంచాయితీల్లో వన నర్సరీలు ఏర్పాటు చేసి ఒక్కో నర్సరీలో సుమారు 12వేల మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. ఈత, తాటి మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మొక్కలను రక్షించేందుకు షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉపాధి హామీలో భాగంగా రూ.18 కోట్లతో సీసీరోడ్లు, మరిన్ని నిధులతో ఫార్మేషన్ రోడ్లు, కంపోస్టు షెడ్లు, ఫాంపాండ్స్, పశువుల పాకలు నిర్మాణాలకు నిధులు వెచ్చిస్తున్నామన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శులు శివప్రసాద్, కిరణ్‌బాబు, ఈసీ రమాపతి, టీఏలు నానీ, రాజేశం ఆయన వెంట ఉన్నారు.

భూములిస్తే ఉపాధి ఎలా..?

- సూరమ్మ ప్రాజెక్టు కాలువ పనులకు భూములివ్వం
- అధికారులకు తేల్చి చెప్పిన చింతకుంట రైతులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని సూరమ్మ ప్రాజెక్టు కుడికాలువకు తాము ఎట్టి పరిస్థితుల్లోనూ భూములివ్వబోమని చింతకుంట రైతులు అధికారులకు తేల్చి చెప్పారు. గురువారం గ్రామంలో రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు గ్రామసభ నిర్వహించారు. కుడికాలువ కోసం గ్రామంలో 24.33 ఎకరాలు అవసరమంటూ అధికారులు సర్వేనంబర్ల వారీగా వివరించారు. దీనికి గ్రామస్తులు మాట్లాడుతూ తమకు ఉన్నదే కొద్ది భూమి అని, ఆ భూమి కాలువ కింద పోతే తమకు ఉపాధి ఎలా అని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, నీటిపారుదలశాఖ ఏఈ హుశాల్‌సింగ్, అధికారులు సోహేల్, మురళి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు కసరత్తు

- జిల్లా మొత్తంగా 25 ప్రతిపాదనలు
- రైతులకు అందుబాటులోకి రానున్న సేవలు



మెట్‌పల్లి సహకార సంఘ కార్యాలయం

మెట్‌పల్లి: జిల్లాలో కొత్తగా మరికొన్ని ప్రాథమిక సహకార సంఘాల(పీఏసీఎస్) ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను రైతులకు మరింత అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో అవసరమైన చోట కొత్తగా సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక అందించాలని జిల్లా సహకార అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం అధికారులు ఆ దిశగా కార్యాచరణను మొదలుపెట్టారు.

జిల్లాలో 51 సంఘాలు..

- జిల్లాలో 20 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 51 ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి.
- వీటి ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాల విక్రయం, పంట రుణాలు, ధాన్యం కొనుగోళ్లు తదితర కార్యకలాపాలు సాగుతున్నాయి.
- కొన్ని సంఘాల పరిధిలో ఎక్కువ గ్రామాలు ఉండడం.. సంఘ కార్యాలయాలకు దూరంగా ఉండడం వల్ల సేవల్లో జాప్యం జరుగుతోంది.
- దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ప్రభుత్వం అవసరమైన చోట కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.

25 ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు

- జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు కొత్తగా 25 సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు అందినట్లు అధికారులు తెలిపారు.
- మెట్‌పల్లి మండలంలోని జగ్గాసాగర్, మల్లాపూర్ మండలంలోని పాతదాంరాజ్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండతోపాటు మరో 22 చోట్ల కొత్తగా ఏర్పాటు చేయాలని ప్రస్తుతమున్న సంఘాల నుంచి ప్రతిపాదనలను స్వీకరించారు.
- గడువు ఇంకా ఉండడంతో వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.
- మరోవైపు వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందులో ఎన్నింటిని ఎంపిక చేయాలన్న దానిపై లోతుగా కసరత్తు చేస్తున్నారు.
- కొత్తగా ఏర్పాటు అయ్యే సంఘం పరిధిలో ఎన్ని గ్రామాలు, ఎంత మంది రైతులు, వచ్చే ఆదాయం ఎంత తదితర వాటి గురించి ఆరా తీస్తున్నారు.
- ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో నివేదికను అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిపాదనలు వస్తున్నాయి

కొత్త సంఘాల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు వస్తున్నాయి. ఇప్పటి వరకు 25 వచ్చాయి. గడువు ముగిసిన తర్వాత జాబితాను ప్రభుత్వానికి అందజేస్తాం. సంఘాల ఏర్పాటు వల్ల రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– మనోజ్‌కుమార్, జిల్లా సహకార అధికారి

క్లుప్తంగా

టీపీబీవో ఫలితాల్లో 43వ ర్యాంకు


సింధూజ

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): టీజీపీఎస్సీ నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్సీస్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన బంగారి సింధూజ 43వ ర్యాంకు సాధించి ప్రభుత్వ ఉద్యోగం కైవసం చేసుకుంది. సింధూజ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసింది. అనంతరం హైదరాబాద్ కమలానెహ్రూ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఆర్కిటెక్చర్ కోర్సు చదివింది. యూట్యూబ్‌లో క్లాస్‌లు విని ర్యాంకు సాధించింది.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి


సచిన్ మృతదేహం

కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణ శివారులోని ఓ రైస్ మిల్లు నీటి సంపులో పడి ఓ వలస కార్మికుడు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన సచిన్ చౌదరి(38) గురువారం ఉదయం రైస్ మిల్లులో బాయిల్డ్‌కు వాడే నీటిసంపు వద్ద కూర్చున్నాడు. ప్రమాదవశాత్తు సంపులో పడి మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోతి దాడిలో మహిళకు గాయాలు

మల్యాల: ఇంట్లోకి వచ్చిన కోతిని బయటకు పంపే క్రమంలో కోతి మహిళపై దాడి చేసి గాయపర్చింది. మండల కేంద్రానికి చెందిన అమృతమ్మ అనే మహిళ ఇంట్లోకి గుంపుగా కోతులు వచ్చాయి. కోతులను బయటకు వెళ్లగొట్టగా.. ఒక కోతి మహిళను గాయపరిచింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స పొందిన మహిళను ఆసుపత్రి సిబ్బంది మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేశారు.

సిలిండర్ లీకేజీతో అగ్ని ప్రమాదం

జగిత్యాలక్రైం: కృష్ణానగర్‌లో గోరెటి నిర్మలమ్మ అనే వృద్ధురాలి ఇంట్లో గురువారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. నిర్మలమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. సిలిండర్ పైప్ లీకేజీ కావడంతో గమనించకుండా వంట చేసేందుకు అంటించగా ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారమివ్వగా.. మంటలార్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి సాతారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకుని రూ.4.15 లక్షలు సీజ్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు జగిత్యాల సీసీఎస్ పోలీసులు దాడులు చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4.15 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

తగ్గుతున్న పాల ఉత్పత్తి

- రోజుకు 2.85 లక్షల లీటర్ల నుంచి 1.80 లక్షల లీటర్లకు తగ్గిన వైనం
- చలి తీవ్రత పెరగడమే కారణం
- ఇబ్బంది పడుతున్న రైతులు, వినియోగదారులు
- ఉమ్మడి జిల్లాలో పరిస్థితి



కరీంనగర్ అర్బన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సాగు రంగం తర్వాత పాడి పరిశ్రమది పెద్దన్న పాత్ర. ఇతర జిల్లాలకు పాలు సరఫరా చేస్తున్న ఘనత మనది. కానీ, చలి పంజాతో గడ్డు పరిస్థితి నెలకొంది. డిసెంబర్ మొదటివారం నుంచి చలి తీవ్రత పెరగగా లీటర్ల కొద్దీ పాల ఉత్పత్తి తగ్గుతోంది. అప్పుడే పశుగ్రాసం కొరత ఏర్పడటంతో మూగజీవాల రక్షణకు పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. 2 నెలల కిందట రోజుకు 2.85 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి కాగా, ప్రస్తుతం 1.80 లక్షల లీటర్లు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. గత వేసవిలో 5 లీటర్ల పాలిచ్చే గేదె ప్రస్తుతం లీటర్ నుంచి లీటరున్నర వరకు తక్కువగా ఇస్తోంది. పాల దిగుబడి తగ్గడానికి ప్రధానంగా ఉష్ణోగ్రతలు అత్యల్ప స్థాయికి చేరడం, పచ్చిగడ్డి దొరక్కపోవడమే కారణమని పశువైద్యులు అంటున్నారు.

పాడి రైతులు 2.10 లక్షల మంది..

ఉమ్మడి జిల్లాలో పాడి గేదెలు 4.20 లక్షలు, ఆవులు 1.12 లక్షలు ఉన్నాయి. పాడి రైతులు 2.10 లక్షల మంది ఉన్నారు. డిమాండ్‌కు సరిపడా పాల ఉత్పత్తి లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు హార్వెస్టర్లతో వరి కోయించి, గడ్డిని మడుల్లోనే కాల్చేశారు. దీంతో జీవాలకు గడ్డి కొరత తీవ్రంగా ఉంది. జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉన్నా పచ్చిక బయళ్లు లేకపోవడంతో పశుగ్రాసం అందకుండా పోతోంది. దాణా, పశుగ్రాసం కొనుగోలు ఖర్చులు పెరగడంతో చేసేదిలేక పలువురు రైతులు పశువులను విక్రయిస్తున్నారు.

ఎన్నో రకాలుగా పాల కల్తీ..

చలి తీవ్రత పాల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నా.. విక్రయాలు మాత్రం తగ్గడం లేదు. పౌష్టికాహారంగా ఉపయోగించే పాలను అక్రమార్కులు ఎన్నో రకాలుగా కల్తీ చేస్తున్నారు. కలుషిత నీరు, ఫార్మలిన్, గ్లూకోజ్, గంజి పౌడర్, యూరియా, సోడియం హైడ్రాక్సైడ్, కాల్షియం హైడ్రోజన్, జంతువుల కొవ్వు, కొన్ని రకాల నూనెలతో పాల పొడి కలిపి, పాలను కల్తీ చేస్తున్నారు. 50 లీటర్ల మంచి పాలలో దాదాపు 30 లీటర్ల కల్తీ పాలు పోస్తున్నట్లు సమాచారం. నిల్వ, రుచి, వాసన కోసం వివిధ రకాల రసాయనాలు కలిపిన పాలు తాగితే అనారోగ్యంతోపాటు శరీరంలో హార్మోన్ల సమతౌల్యం దెబ్బతిని, వంధ్యత్వం వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. చిన్న పిల్లలు కల్తీ పాలను తాగడం వల్ల వారిలో పోషకాహార లోపం ఏర్పడి, రక్తహీనతకు దారితీస్తుందని ఎండీ పల్మనాలజిస్టు సాయిని నరేందర్ తెలిపారు. కల్తీ మాఫియాకు అడ్డుకట్ట వేయాల్సిన ఆహార నియంత్రణ విభాగం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. కరీంనగర్ ఆహార నియంత్రణ అధికారి ఇన్‌చార్జి కావడంతో ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళ్తారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందని పలువురు చర్చించుకుంటున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

చలికాలంలో పాడి పశువుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్‌బి.శ్రీనివాస్ సూచించారు. ముఖ్యంగా ఆవుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, చలికి వ్యాధులు వ్యాపించడమే కాకుండా పాల ఉత్పత్తి బాగా తగ్గిపోతుందన్నారు. చలి నుంచి రక్షణగా పశువుల పాకల చుట్టూ పరదా వంటివి కట్టాలని, ఎండు గడ్డిని ఎక్కువగా ఇవ్వాలని పేర్కొన్నారు. చలికాలంలో జీవాలకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యులను సంప్రదించాలని చెప్పారు.

4 లీటర్లే ఇస్తున్నాయి..



వాతావరణంలో మార్పుల వల్ల గేదెలు పాలు తక్కువగా ఇస్తున్నాయి. నవంబర్ వరకు ఒక్కో గేదె 5 లీటర్లు ఇవ్వగా ఇప్పుడు 4 లీటర్లే ఇస్తున్నాయి. వినియోగదారులకు పాలు సరఫరా చేయలేకపోతున్న.

– శ్రీనివాస్ రెడ్డి, పాడి రైతు

ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు..



హార్మోన్లు బ్యాలెన్స్ తప్పడం, చలి కాలంలో ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గుల వల్లే పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతోంది. పచ్చిగడ్డి ఎదుగుదల సరిగా లేకపోవడం వల్ల జీవాలకు పోషకాలున్న గ్రాసం అందడం లేదు.

– తుమ్మల కిరణ్‌కుమార్ రెడ్డి, పశువైద్యుడు



రాజన్నా నీవే దిక్కు

వేములవాడ: రాజన్నను గురువారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండం మూసి ఉండడంతో షవర్ల వద్ద భక్తులు స్నానాలు చేసి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తుల ద్వారా రూ.9లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

‘ముక్కోటి’కి సిద్ధం


విద్యుత్ దీప కాంతుల్లో ఆలయ ఉత్తర ద్వారం

వేములవాడ: రాజన్న ఆలయం ముక్కోటి దర్శనాలకు ముస్తాబైంది. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులకు దర్శన అవకాశం కల్పించనున్నారు. ఈమేరకు గురువారం రాత్రి వరకే అన్ని ఏర్పాట్లను ఆలయ అధికారులు పూర్తి చేశారు. ఉదయం 3 గంటలకు మంగళవాయిద్యాలు, 3.40 వరకు సుప్రభాతం, 5 గంటలకు స్వామి వారికి ప్రాతఃకాల పూజ, 5.10 గంటలకు పల్లకీ సేవలపై ఉత్తర ద్వార ప్రవేశం కల్పిస్తారు. మహాహారతి అనంతరం తిరిగి ఆలయ ప్రవేశం ఉంటుంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆర్జిత సేవలు, అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం తర్వాత అన్నపూజ టికెట్లు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీకి యూజీసీ అటానమస్


ఉత్తర్వులు ఆవిష్కరిస్తున్న ట్రినిటి వ్యవస్థాపకుడు మనోహర్‌రెడ్డి తదితరులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీకి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి అటానమస్ హోదా లభించిందని అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. యూజీసీ వారు అందించిన ఉత్తర్వులను గురువారం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ న్యాక్ బి గ్రేడ్ సాధించి అటానమస్‌గా గుర్తింపు పొందడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో అటానమస్ హోదా పొందిన తొలి కాలేజీగా ట్రినిటి కళాశాలకు గౌరవం దక్కిందన్నారు. ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఏవో సురేశ్, చొప్పరి వంశీ, రాజిరెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బావిలో పడి బాలుడు దుర్మరణం

- చేపలు వేటాడుతుండగా ఘటన


కార్తీక్ (ఫైల్)

మల్లాపూర్: చేపల వేటకు వెళ్లిన ఓ బాలుడు అక్కడే ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని గొర్రెపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నేదునూరి కార్తీక్(14) వ్యవసాయ బావిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెతుకుతుండగా.. ఓ రైతు వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. పోలీసులు ఘటనస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈత రాకనే మునిగి చనిపోయినట్లు నిర్ధారించారు. కార్తీక్ తండ్రి రాజం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు


- తప్పిన పెను ప్రమాదం
- ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురు


స్వల్ప గాయాలతో బయటపడిన బాధితులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారులో గురువారం ఓ కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. విద్యుత్ స్తంభం విరిగిపడింది. కరీంనగర్‌కు చెందిన ముగ్గురు కామారెడ్డి జిల్లా మాచారెడ్డి నుంచి కారులో వస్తుండగా ప్రమాదం జరిగింది. స్తంభం విరిగి పడడంతో సెస్ అధికారులకు స్థానికులు సమాచారం అందించడంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. స్వల్పంగా గాయపడ్డ వారిని చికిత్స కోసం సిరిసిల్లకు తరలించారు. సెస్ అధికారుల ఫిర్యాదుతో కారు డ్రైవర్ సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

‘ముక్కోటి’కి ముస్తాబైన లక్ష్మీనృసింహస్వామి

- నేడు ఉత్తర ద్వార దర్శనం


ముస్తాబైన ధర్మపురి దేవస్థానం


ధర్మపురిలో పార్కింగ్ స్థలాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

ధర్మపురి: ముక్కోటి వైకుంఠ ఏకాదశికి ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ముస్తాబైంది. స్వామివారిని శుక్రవారం ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకునేందుకు వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. వారి సౌకర్యార్థం ఆలయం ఆవరణలో ఏర్పాట్లు చేశారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అనుబంధ ఆలయాలను రంగు రంగుల పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రాజగోపురాలకు విద్యుత్ లైట్లు, పూలతో అలంకరణ, వైకుంఠ ద్వారం ముస్తాబు, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. లడ్డూ, పులిహోర కొరత లేకుండా తయారు చేయిస్తున్నారు. పుష్పవేదికపై ముమ్మూర్తులైన యోగా, ఉగ్ర లక్ష్మీనృసింహస్వాములు, వేంకటేశ్వర స్వాములను ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు జరిపించనున్నారు. వేకువజామున ఐదు గంటలకు ఉత్తర ద్వారాన్ని తెరిచి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఉదయం 8 గంటలకు ఉత్సవ మూర్తులతో శోభాయాత్ర చేపట్టనున్నారు. ఈ మేరకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్శనానికి ఎమ్మెల్యే అడ్లూరి, ఎంపీ గడ్డం వంశీ, కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు హాజరుకానున్నారు. శ్రీసాయి శివబాలాజీ మందిరంలో ఆలయ వ్యవస్థాపకులు ప్రవీణ్‌శాస్త్రి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కోరారు. దైవదర్శనంతోపాటు గోదావరి స్నానాల కోసం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున శుక్రవారం సాయంత్రం ఐదు గంటలవరకు ట్రాఫిక్ రూల్స్‌ను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రజలు, వాహనదారులు సహకరించాలని తెలిపారు. నందీ కూడలి నుంచి ఆలయం, బ్రాహ్మణ సంఘం వరకు వాహనాలకు అనుమతి లేదన్నారు. వారికి కూరగాయల మార్కెట్, నందీ కూడలి, హరితా హోటల్, మంగలిగడ్డ, బ్రాహ్మణ సంఘం వద్ద పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం పార్కింగ్ స్థలాలను పరిశీలించి తగిన సూచనలు అందించారు. ఆయన వెంట సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

పండుగకు ఊరెళ్తున్నారా.. పారాహుషార్

- పోలీసుల సూచనలు పాటించాలి
- రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్


సీపీ ఎం.శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): సంక్రాంతి పండుగ సెలవుల నేపథ్యంలో ఊరికి వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్‌కమిషనర్ ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. సొంతూళ్లకు, విహారయాత్రకు వెళ్లేవారు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా పలు సూచనలు, సలహాలు అందజేశారు.

- సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే అప్‌డేట్స్ పెట్టొద్దు.
- స్వీయ రక్షణకు ఇంట్లో సీసీ కెమెరా అమర్చుకోవాలి.
- ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కి సమాచారం అందించాలి.
- ఊరికి వెళ్లాల్సి వస్తే బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు.
- సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు ఇళ్లకు సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్ ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తాం.
- వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్‌తో లాక్ వేయడం మంచిది.
- నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్‌మెన్/ సెక్యూరిటీ గార్డ్/ సర్వెంట్‌గా నియమించుకోవాలి.
- పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి.
- ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి. ఇంటి ఎదుట చెత్త చెదారం, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడండి. వాటిని కూడా గమనించి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంది.

త్రీడీ ఆర్టిస్టుకు ఏసీపీ అభినందన


అభినందిస్తున్న ఏసీపీ రమేశ్

మంథని: సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాలర్ ట్యూన్ టోల్ ఫ్రీ నంబర్ 1930ని ప్రముఖ అంతర్జాతీయ ఆర్టిస్టు ఎస్ఎస్ఆర్ కృష్ణ త్రీడీ ఆర్ట్ వేయగా గోదావరిఖని ఏసీపీ రమేశ్ అభినందించారు. ఫోన్, మెస్సేజ్, లింక్‌ల ద్వారా చాలా మంది మోసపోయి ఇబ్బంది పడుతున్నారని, ఇలా జరుగకుండా జాగ్రత్తగా పడాలన్నారు. కృష్ణ వెంట వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత ఖాజామోయినొద్దీన్ ఉన్నారు.

హోటళ్లకు జరిమానా

జగిత్యాల: హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రత పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాము అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లకు రూ.10 వేల జరిమానా విధించారు.

లారీ ఢీకొని యువకుడు మృతి


అజయ్ (ఫైల్)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మానకొండూర్: బతుకు దెరువు కోసం తండ్రి దుబాయ్ వెళ్లగా, కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పెద్దూర్‌పల్లి గ్రామానికి చెందిన గంగినేని సంపత్, శ్యామల దంపతులకు అజయ్ (24) సిద్దు (4) కుమారులున్నారు. తండ్రి సంపత్ బతుకు దెరువుకోసం దుబాయ్‌కు వెళ్లగా, అజయ్ డిగ్రీ వరకూ చదువుకొని కరీంనగర్‌లోని అశోక్ లేలాండ్ కంపెనీలో సెల్స్ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సిద్దు నాలుగో తరగతి చదువుతున్నాడు. గురువారం అజయ్ బైక్‌పై విధులకు బయలుదేరాడు. ఈదులగట్టెపల్లి శివారులోకి చేరుకోగానే గ్రానైట్ లారీ, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో అజయ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అజయ్ మృతివార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. సీఐ లక్ష్మీనారాయణ ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడు తండ్రి దుబాయ్ నుంచి వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో పండుగ పూట గ్రామంలో విషాదం నెలకొంది.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపిక


ప్రాజెక్టు ప్రదర్శనలో అభిలాష్

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం నందిమేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అభిలాష్ ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో జాతీయస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం వసంత తెలిపారు. ఇటీవల ఎన్టీపీసీలో జరిగిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో అభిలాష్ సోలార్ పవర్ ద్వారా ఉప్పునీటిని శుద్ధ జలాలుగా మార్చే విధానం ప్రదర్శించగా రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 7 నుంచి 9 వరకు జడ్చర్లలో ఇదే ప్రదర్శన ఇచ్చి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 21 నుంచి పుదుచ్చేరిలో జరిగే జాతీయస్థాయి ప్రదర్శనలో పాల్గొంటాడు. ఈసందర్భంగా అభిలాష్‌ను, ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు రజితను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మాదిగ కళాకారుల రథయాత్ర ప్రారంభం


మాట్లాడుతున్న కళాకారులు

విద్యానగర్(కరీంనగర్): ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు–లక్ష డప్పుల ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాదిగ కళాకారుల రథయాత్రను కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా అంబేడ్కర్ సర్కిల్ వద్ద ప్రారంభించారు. ఏబీసీడీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కొంతమంది మాలలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కళాకారులు రామంచ భరత్, గజ్జల అశోక్, ప్రభాకర్, ఒల్లాల వాణి, సుమన్, రుద్రప్ప రామచంద్ర, బోయిని కొమురన్న, ప్రభాకర్, థామస్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్ల మొదటి బైపాస్ రోడ్డు పక్కన మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ నుంచి వృథాగా పోతున్న నీరు


సిరిసిల్ల మొదటి బైపాస్ రోడ్డు వెంట వృథాగా మిషన్ భగీరథ నీరు

‘భగీరథ’ నీరు వృథా

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డు పక్కన మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ ద్వారా నీరు వృథాగా పోతుంది. శుద్ధిచేసిన నీరు గేట్‌వాల్వ్ వద్ద నిర్వహణ లోపంలో ఇలా వృథాగా పోతుంది. భారీ ఎత్తున నీరు లీకేజీ అవుతుండడంతో బైపాస్ రోడ్డు వెంట ఉన్న బీడు భూములు తడిశాయి. శుద్ధిచేసిన తాగునీరు ఇలా వృథా కావడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.